నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, సోమవారం 6 మే 2024 | VIKARABAD




ప్రచారంలో భాగంగా ఆదివారం గౌతాపూర్ గ్రామంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి

# బీఆర్ఎస్ ప్రచార హోరు..

వికారాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల ప్రచార గడువు సమీపిస్తుండడంతో ఆయా పార్టీల ప్రచారం జోరందుకున్నది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. చేవెళ్లలో మరోసారి గెలుపొంది హ్యాట్రిక్ విజయం సాధించేలా బీఆర్ఎస్ పార్టీ పక్కా వ్యూహంతో ముందుకెళ్తున్నది. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేయడంతో కార్యరంగంలో కదం తొక్కుతున్నారు. అంతేకాకుండా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుదీర్ఘ రాజకీయ అనుభవంతోపాటు మంచి పేరున్న బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ చేవెళ్ల నుంచి బరిలోకి దింపడంతో ఎక్కడికెళ్లినా జనం స్వచ్ఛందంగా తరలివచ్చి బ్రహ్మరథం పడుతున్నారు. జిల్లాలోని వికారాబాద్, పరిగి సెగ్మెంట్ల సన్నాహక సమావేశాల్లో పాల్గొన్న పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్ఎస్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇం టింటికీ వివరించి ఓట్లు అభ్యర్థించాలని సూచించడంతోపాటు.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఐదునెలలు దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని.. ప్రజల్లోకి ఈ అంశాన్ని విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపు నివ్వడంతో వారు గ్రామగ్రామాన జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఎంపీలుగా గెలిపిస్తే తమ స్వార్థం కోసం పార్టీలు మారిన రంజిత్ రెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డిలను ఓడించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు కసిగా పనిచేస్తున్నారు.

### ప్రచారంలో బీఆర్ఎస్ దూకుడు..

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ స్పీడ్ పెంచారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పాటైన అనంతరం వరుసగా రెండుసార్లు విజయదుందుబి మోగించిన బీఆర్ఎస్ మూడోసారి కూడా చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేసేలా పక్కాప్లాన్‌తో ముందుకెళ్తున్నది. ప్రచారానికి మరో ఏడు రోజుల గడువే ఉండడంతో బీఆర్ఎస్ శ్రేణులు జిల్లా అంతటా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లోని మం డలాల్లో నిర్వహిస్తున్న రోడ్‌షోలకు కాసాని హాజరై నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉండి చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని జనాలను కోరుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసానితోపాటు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రచారంలో పాల్గొంటూ బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గమంతటా కాసానికి మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు ఊరూరా ప్రచారం చేస్తున్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీలు, గ్రామాల్లో కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ప్రచారం హోరెత్తుతున్నది. వికారాబాద్ సెగ్మెంట్లో రోజుకొక మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ప్రచారం నిర్వహిస్తున్నారు. వికారాబాద్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం జోరుగా సాగుతున్నది. తాండూరు సెగ్మెంట్‌లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి మండలాల వారీగా కాసానికి మద్దతుగా ప్రచారం చేస్తూ ప్రజాశీర్వాద సభలు నిర్వహిస్తున్నారు. పరిగి నియోజకవర్గంలోనూ మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలాల వారీగా రోడ్ షోలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకుల ఆధ్వర్యంలో పరిగి మున్సిపాలిటీలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం జరుగుతున్నది. ఏ గ్రామానికెళ్లినా బీఆర్ఎస్ అభ్యర్థికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. బీసీలే కాకుండా అన్ని వర్గాలు కూడా కాసానికి సంపూర్ణ మద్దతు పలుకుతున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవంతోపాటు జడ్పీచైర్మన్‌గా పనిచేసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉండడంతో వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాలకు చెందిన నాయకులు పార్టీలకతీతంగా కాసానిని గెలిపించుకునేందుకు సన్నద్ధమవుతున్నారు.

### మూడోసారి గెలుపే లక్ష్యంగా..

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో హ్యాట్రిక్ గెలుపే లక్ష్యంగా పక్కా వ్యూహంతో బీఆర్ఎస్ పార్టీ ప్రచారంలో దూసుకెళ్తున్నది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలపై పట్టుండ డంతోపాటు ప్రతి నియోజకవర్గంలోనూ పార్టీలకతీతంగా సొంత క్యాడర్‌ను కలిగి ఉన్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంపై మూడోసారి గులాబీ జెండా ఎగురవేసేలా పక్కా ప్లాన్‌తో ముందుండి నడిపిస్తున్నారు. వికారాబాద్, పరిగి, తాండూరు, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం నియోజకవర్గాల్లోని నాయకులను సమన్వయం చేసుకుం టూ గెలుపే లక్ష్యంగా ఆమె ప్రచారంలో ముందుకెళ్తున్నారు.

## బీఆర్ఎస్‌లో వంద మంది యువకుల చేరిక



పరిగి, మే 5 : వివిధ గ్రామాలకు చెందిన వంద మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు ఆదివారం పరిగిలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి గట్టు రాంచందర్‌రావు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

- ఆరు గ్యారెంటీలలో ఒక్క హామీని నెరవేర్చలేదు
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- మర్పల్లిలో కార్యకర్తల సమావేశం, కౌకుంట్ల గ్రామంలో ఇంటింటి ప్రచారం



మర్పల్లిలోని సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

# కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

మర్పల్లి/చేవెళ్ల రూరల్, మే 5 : గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి మోసపోవద్దని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంసీఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించి పార్టీలు మారిన వారికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సూచించారు. ఈ ప్రాంత ప్రజలకు తెలియని రంజిత్‌రెడ్డిని కేసీఆర్ పిలుపు మేరకు ఎంపీగా గెలిపిస్తే మోసం చేసి కాంగ్రెస్‌లో చేరారన్నారు. బీఆర్ఎస్ నుంచి చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాసాని జడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడు రంగారెడ్డి జిల్లా అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ బస్సు యాత్రతో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల్లో భయం పుట్టుకున్నదని ఆరోపించారు.

### అన్ని వర్గాలకు అండగా ఉంటా..

**– బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్**

ఐదు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. కరెంటు, తాగునీటి సమస్యలు మళ్లీ మొదలయ్యాయన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో జడ్పీ చైర్మన్‌గా పని చేసిన తనకు జిల్లావాసులతో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

### ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

**–మాజీ ఎమ్మెల్యే ఆనంద్**

కాసాని గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ పిలుపునిచ్చారు. రేవత్‌రెడ్డిపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. దేవుండ్లపై ఒట్లు పెట్టి ఆగస్టు 15 వరకల్లా రైతు రుణమాఫీ చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉన్నదని, రుణమాఫీ చేయకపోతే రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలన్నారు. ఆరు గ్యారెంటీలలో ఒక్క హామీని కూడా సరిగ్గా నెరవేర్చలేదన్నారు. తాగు నీరు, విద్యుత్తు సమస్యలు ఎక్కువయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఎంపీపీ లలితా రమేశ్, జడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్, యూత్ అధ్యక్షుడు మధుకర్, గఫార్, ఖాజా, సొసైటీ డైరెక్టర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### స్వగ్రామం కౌకుంట్లలో ఎమ్మెల్యే సబితారెడ్డి ఇంటింటి ప్రచారం

బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా మండే ఎండలను సైతం లెక్కచేయకుండా రాష్ట్ర మాజీ విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆమె జన్మదినం సందర్భంగా చేవెళ్ల మండలంలోని స్వగ్రామం కౌకుంట్లలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అంతకు ముందు దివంగత మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం కౌకుంట్లలో ఇంటింటికీ తిరుగుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం కాగా, పదేండ్లలో బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు నయా పైసా సాయం చేయలేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు గతంలో బీఆర్ఎస్ తరపున నిలబడి ఎంపీలుగా గెలిచిన వారేనన్నారు. మూడోసారి బీసీల ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాయమాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. డిసెంబర్ 9న రైతుబంధు రూ.15 వేలు, రూ.2 లక్షల రుణమాఫీ, రూ.4 వేల పింఛన్, మహిళలకు ఆర్థిక సాయం, యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ చేసిన వాగ్దానాలను గాలికొదిలేసిందన్నారు. తెలంగాణ వాణి పార్లమెంట్‌లో వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి కాసానిని గెలిపించాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ సభలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడంతో పాలక పక్షాలు గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. 5 నెలల్లో రేవంత్ పరిపాలన చూసి కేసీఆర్‌ను ఎందుకు వదులుకున్నాం.. అని ప్రజలు బాధపడుతున్నారని గుర్తు చేశారు. కేసీఆర్ పాలనలో రెప్పపాటు కరెంట్ పోకుండే.. ఇప్పుడు తరుచూ పోతుందన్నారు. 96 బీసీ కులాలను ఏకం చేసిన గొప్ప నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపిస్తే పాలమూరు – రంగారెడ్డికి జాతీయ హోదా తీసుకొచ్చేందుకు పార్లమెంట్‌లో తన గళం విప్పి పోరాటం చేస్తారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్లలో తెలంగాణకు ఏమి చేయలేదని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీలు ఎక్కడికి పోయాయని విమర్శించారు. ఒక్క విద్యాలయం కూడా ఇవ్వలేదని, పాలమూరు – రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలేదన్నారు. కల్యాణలక్ష్మి పథకంతో రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కష్టాల్లో ఉన్న రైతుల వద్దకు వెళ్తే సీఎం రేవంత్‌రెడ్డి స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ చూస్తున్నారని, ప్రజలు, రైతులపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

### ఆలూర్, వెంకన్నగూడలో..

మండల పరిధిలోని ఆలూర్, అనుబంధ గ్రామం వెంకన్నగూడ గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకుడు, సబితారెడ్డి తనయుడు కౌశిక్‌రెడ్డి, రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ పులుమామిడి నారాయణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, కౌకుంట్ల అంతారం మాజీ సర్పంచ్‌లు గాయత్రిగోపాలకృష్ణ, సులోచనాఅంజన్‌గౌడ్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు శేఖర్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు శేరి శివారెడ్డి, ఈర్లపల్లి మాజీ ఉప సర్పంచ్ కొల్లగల్ల స్వర్ణలతాభాస్కర్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డి, శివ, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, ఆలూర్ మాజీ ఉప సర్పంచ్‌లు కసిరె వెంకటేశ్, కొల్లగల్ల స్వర్ణలతాభాస్కర్, మాజీ సర్పంచ్‌లు నరహరిరెడ్డి, నర్సింహులు, లావణ్యాశంకర్, భానుతేజ, మాజీ వార్డు సభ్యుడు పాండు, ఇరు గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మర్పల్లిలోని సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

# ఇది సిగ్గులేని ప్రభుత్వం

- ఆరు గ్యారెంటీల అమలులో విఫలం
- క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి
- యాచారంలో బీఆర్ఎస్ రోడ్‌షోకు విశేష స్పందన



యాచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, పక్కన ఎన్నికల ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

యాచారం, మే 5 : వంద రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని చేయని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సిగ్గులేనిదని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో ఆదివారం భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించగా, ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్పా సీఎం రేవంత్‌రెడ్డి ఒరుగబెట్టిందేమీలేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో రైతుభరోసా డబ్బులు లేవు, రుణమాఫీ లేదు, కల్యాణలక్ష్మి తులం బంగారం లేదు, పింఛన్లు తదితర వాటినన్నింటినీ గాలికొదిలేశారని మండిపడ్డారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే దేశం మొత్తం బడాబాబుల చేతుల్లో ఉంటుందన్నారు. మతోన్మాదం, అరాచకాలు పెరిగి సామాన్యుల బతుకు భారమవుతుందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జనగాం మాజీ ఎమ్మెల్యే, ఎన్నికల ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితి ఉన్నదన్నారు. తాటాకు చప్పుళ్లకు భయపడేదిలేదు.. రేవంత్‌రెడ్డి ఒళ్లు దగ్గర పెట్టుకో.. అని హెచ్చరించారు. కొంత మంది పార్టీని వీడినంత మాత్రాన బీఆర్ఎస్‌కు నష్టం లేదన్నారు. దొంగలకు బీఆర్ఎస్‌లో చోటులేదని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే కాంగ్రెస్ మెడలు వంచి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు నల్లగొండ ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, జడ్పీటీసీ జంగమ్మ, మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాష, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



యాచారంలో రోడ్‌షోకు హాజరైన జనం

### మంచాల చౌరస్తాలో రోడ్‌షో..

మంచాల : అబద్ధాల కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని, బడుగు బలహీన వర్గాలకు చెందిన క్యామ మల్లేశ్‌ను భువనగిరి ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం రాత్రి మంచాల గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలంటూ గారడీ చేసి గద్దెనెక్కిందన్నారు. ఐదు నెలలు దాటినా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంటు అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ తెలంగాణ వాణి పార్లమెంట్‌లో వినిపించాలంటే బీసీ బిడ్డనైన తనను గెలిపించాలని కోరారు. అబద్ధాలతో ప్రజలను మోసం చేయడానికి వస్తున్న కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి, ఎంపీపీ నర్మద, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చీరాల రమేశ్, బహదూర్, నాయకులు పుల్లారెడ్డి, జంబుల కిషన్‌రెడ్డి, మొగిలి వెంకటేశ్, మొగిలి పావణి, జగన్‌రెడ్డి, రావు శంకర్, సుకన్య, చిందం రఘుపతి, కందాల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

- పాలమూరు అభివృద్ధికి పైసా కూడా ఇవ్వని బీజేపీని నమ్మొద్దు
- ఎంపీ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎన్నికల ఇన్‌చార్జి దూదిమెట్ల బాల్‌రాజ్
- పలు గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం



మధురాపూర్ గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్

# దగా చేసిన కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దు

షాద్‌నగర్, మే 5 : మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి, తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి, పాలమూరు అభివృద్ధి కోసం పైసా కూడా ఇవ్వని కేంద్రంలోని బీజేపీలకు ఓటు వేయవద్దని బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్, ఎన్నికల ఇన్‌చార్జి దూదిమెట్ల బాల్‌రాజ్‌యాదవ్‌లు ప్రజలను కోరారు. ఆదివారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని బూర్గుల, మధురాపూర్, కడియాల కుంట తండా, పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, వేముల్‌నర్వ, సంగెం గ్రామాలతో పాటు షాద్‌నగర్ పట్టణంలో ర్యాలీలు, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కేవలం కేసీఆర్‌పై ఆరోపణలు చేస్తున్నారని, ఇది ప్రజలు గమనించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలమూరు జిల్లా కోసం ఒక్క పైసా కూడా కేటాయించలేదని, ఒక్క ప్రాజెక్టుకైనా నిధులు ఇచ్చారా.. అని ప్రశ్నించారు. ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్, బీజేపీలు యువతను మోసం చేశాయన్నారు. మళ్లీ ఆగం కాకుండా కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు రాంబాల్‌నాయక్, వంకాయల నారాయణరెడ్డి, నరేందర్, జగదీశ్వర్ గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రంగయ్యాగౌడ్, బుచ్చిగూడ వెంకట్ రెడ్డి, బక్కన్నయాదవ్, రవియాదవ్ పాల్గొన్నారు.



బూర్గుల గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణుల ర్యాలీ